సాక్షి
మహబూబాబాద్
శనివారం । 29 । జూలై । 2023



పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీషెడ్యూల్
కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు
ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
26.2^0 / 22.8^0
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వాగు దాటి.. పింఛన్ అందించి..



కొత్తగూడ: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వితంతులు, వృద్ధులకు నెలనెలా ఆసరా పింఛన్ అందిస్తోంది. వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు పొంగుతుండడంతో మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ ఇప్పటి వరకు అందించలేదు. ఈ క్రమంలో వాగుల ప్రవాహం తగ్గనప్పటికీ పోస్ట్ ఉమెన్ స్వాతి శుక్రవారం తన ద్విచక్రవాహనం కత్తెర్లవాగు వద్ద నిలిపి స్థానికుల సహాయంతో అవతలి ఒడ్డు వైపు ఉన్న వేలుబెల్లి, చెరువుముందుతండాకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించారు. దీంతో పింఛన్‌దారులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జె.విజయ్ శుక్రవారం తెలిపారు. ఆర్టీసీ డిపో అభివృద్ధికి ప్రజలు తమ సలహాలు, సూచనలు ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు సెల్ 99592 26054 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ బాబురావు



బయ్యారం: గార్ల–బయ్యారం సీఐగా బాబురావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రామగుండంలో పనిచేస్తున్న బాబురావును ఇక్కడికి బదిలీ చేశారు. కాగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన బాబురావును ఎస్సై ఉపేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

100 పడకల ఆస్పత్రిగా మరిపెడ దవాఖాన



మరిపెడ: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని 100పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య విధానపరిషత్ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులు వెలువరించారు. మండలంలోని 44 గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కృషి ఫలించింది. 100పడకల ఆస్పత్రి ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి



నెల్లికుదురు: వర్షాల నేపథ్యంలో పంట చేలల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఏడీఏ లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లితో పాటు ఆకేరు వాగు పరిసర ప్రాంతాల్లోని పంటలను ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, ఏఈఓ ప్రవీణ్‌తో కలిసి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. పత్తి, పెసర, మొక్కజొన్న ఇతర పంటల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

మహబూబాబాద్ అర్బన్: వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 30న చేపట్టనున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా వేసినట్లు అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి బాస నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఆగస్టు 2వ తేదీన ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9052670288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వాన.. వరద.. నష్టం

- భారీ వర్షాలతో తెగిన రోడ్లు, కల్వర్టులు
- విరిగి పడిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- కూలిన ఇళ్లు.. ప్రజలు సతమతం
- కోళ్లు, గేదెలు, కాడెడ్లు మృతి
- పంట, ఆస్తి నష్టం అంచనా వేస్తున్న అధికారులు



మానుకోటలోని మున్నేరు వాగు బ్రిడ్జి సమీపంలో కొట్టుకుపోయిన రహదారి

సాక్షి, మహబూబాబాద్: భారీవర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. వరదలతో రోడ్లు, కల్వర్టులు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవడంతో చాలా గ్రామాల్లో అంధకారం అలుముకుంది. అయితే విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కోళ్ల ఫాంలోకి నీరు చేరడంతో వేలాది కోళ్లు మృతి చెందాయి. వరదతోపాటు, పిడుగులు, విద్యుత్ షాక్‌తో జిల్లాలో కాడెడ్లు, గేదెలు మృత్యువాతపడ్డాయి. కూలిన ఇళ్లతో ప్రజలు సతమతమవుతున్నారు. అలాగే వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో పలు కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇళ్లు ఖాళీ చేసిన వెళ్లిన వారు వరద తగ్గడంతో ఇంటికి చేరుకొని సామాన్లు సర్దుకుంటున్నారు. కాగా నీట మునిగిన పంటలు, ఇతర ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

45చోట్ల రోడ్లు ధ్వంసం..
వరద ప్రవాహంతో జిల్లా వ్యాప్తంగా 30చోట్ల సగానికి పైగా, 15చోట్ల పూర్తిస్థాయిలో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1.5కోట్లు, శాశ్వత నిర్మాణాల కోసం రూ.6కోట్ల వరకు నిధులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. పలుచోట్ల కోళ్లు, గేదెలు, కాడెడ్లు మృతి చెందాయి. జిల్లాలోని పెద్దవంగర బాయిలర్ కోళ్లఫాంలో 5,800 కోళ్లు, కేసముద్రంలో 3,000 కోళ్లతోపాటు తొర్రూరులో 5,000 కోడి పిల్లలు మృతి చెందాయి. విద్యుదాఘాతంతో నెల్లికుదురు మండలం వాయిలాలో నల్ల శ్రీనివాస్‌రెడ్డి రెండు గేదెలు, మరిపెడ మండలం గుండెపుడి పంచాయతీకి చెందిన బానోత్ లింగ్యా గేదె, పెద్దవంగర గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి గేదె, మరిపెడ మండలం వాల్యాతండాలో తేజావత్ రమేష్ ఆవు మృతి చెందింది. గంగారం మండలం కామారం గ్రామానికి చెందిన ఈసం సత్యం రెండు కాడెడ్లు పిడుగు పాటుతో మృత్యువాతపడ్డాయి.

ఇళ్లు నేలమట్టం
వర్షాలతో జిల్లాలోని 146 ఇళ్లు కూలిపోయాయి. ఇందులో 105ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా.. 14గృహాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. దీంతో ఇంటిల్లిపాది బంధువులు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. కేసముద్రం మండలంలో 15 ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. మహబూబాబాద్‌లో ఎనిమిది, పెద్దవంగరలో 12, గంగారం, నర్సింహులపేట మండలాల్లో మూడు ఇళ్ల చొప్పున కూలిపోయాయి. డోర్నకల్, కేసముద్రం, మహబూబాబాద్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో 221 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా వరద తగ్గడంతో పాక్షికంగా కూలిన ఇళ్ల మరమ్మతులు, పూర్తిగా ధ్వంసమైన ఇళ్ల వద్ద తాత్కాలిక ఏర్పాట్లు చేసుకునే పనిలో ఉన్నారు.

నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు..
వరద బీభత్సంలో జిల్లాలోని విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 400 స్తంభాలు విరిగిపోగా, 102 ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. మరో 20 ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడిపోయాయి. కాగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. అలాగే వరదతో దెబ్బతిన్న పంటలు, ఆస్తినష్టంపై సంబంధిత అధికారులు అంచనా వేసి నివేదిక తయారు చేయనున్నారు.

ధ్వంసమైన కల్వర్టు..



కొల్లాపురం శివారులో కొట్టుకుపోయిన కల్వర్టు

గూడూరు: మండలంలోని కొల్లాపురం శివారులో పారుతున్న పాకాలవాగు ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోయింది. పక్కనే నిర్మించిన కంపోస్టు షెడ్డు, శ్మశానవాటికలో నిర్మించిన గదులు కూలిపోయాయి.

తాత్కాలిక మరమ్మతు..



జేసీబీతో రోడ్డు మరమ్మతు పనులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు మున్నేరు వాగులో వరద ఉధృతి తగ్గింది. దీంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. వాగు బ్రిడ్జి సమీపంలో మానుకోట వైపు రోడ్డు రెండు వైపులా కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి.

కోతకు గురైన రోడ్లు



తాళ్ల ఊకల్ శివారు పాలేరు వాగు బ్రిడ్జి సమీపంలో కోతకు గురైన రహదారిపై ప్రవహిస్తున్న నీరు

మరిపెడ రూరల్: మండలంలోని తాళ్లఊకల్ గ్రామ శివారు పాలేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జికి ఆనుకొని రహదారి రెండుచోట్ల కోతకు గురైంది. వరద ప్రవాహం కొనసాగుతుండడంతో వాగు అవతలి ఒడ్డున ఉన్న అజ్మీరతండా, ధక్యాతండా, ఆనకట్టతండాల నుంచి తాళ్లఊకల్, మరిపెడకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. అలాగే తానంచర్ల పాలేరు వాగు లోలెవల్ వంతెనపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో వారం రోజులుగా సరిహద్దులో ఉన్న సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాలకు మరిపెడ మండలానికి రాకపోకాలు నిలిచిపోయాయి.

ఆస్పత్రిలోకి వరద నీరు..



ఆస్పత్రి భవనం లోపలకు చేరిన వర్షపు నీరు

మండలంలోని ఎడ్జెర్ల ప్రాథమి ఆరోగ్య ఉప కేంద్రంలో వరద నీరు చేరుకుంది. దీంతో ఆస్పతికి వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

గుంతలమయం..

కొత్తగూడ: ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. మండల కేంద్రం నుంచి సాదిరెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి ఓటాయి క్రాస్ రోడ్డు సమీపంలో కోతకు గురైంది. రోడ్డు మొత్తం కొట్టుకుపోయి పైపులు మాత్రమే మిగిలాయి. అలాగే మండల కేంద్రం నుంచి కొత్తపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో బీటీ లేచిపోయి గుంతలు పడ్డాయి. నర్సంపేట నుంచి కొత్తగూడకు వచ్చే దారి గాదే వాగు వద్ద లోలెవల్ కాజువే దెబ్బతిని ప్రమాదకరంగా మారింది.



వరద కోతకు భారీగా దెబ్బతిన్న రోడ్డు

విరిగిన విద్యుత్ స్తంభాలు.. కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు

డోర్నకల్: భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడగా.. ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. ఆయా గ్రామాల్లో 60కి పైగా స్తంభాలు నేలమట్టం కాగా.. పదికి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగు, ముల్కలపల్లి సమీపంలోని ఆకేరువాగులో వరద ప్రవాహానికి వాగులోని స్తంభాలు కూలిపోయాయి.



ఉయ్యాలవాడ క్రాస్ రోడ్డు వద్ద కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

రోడ్డు కోత..



నర్సింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లిలో కోతకు గురైన బీటీ రోడ్డు

నర్సింహులపేట: వర్షాలతో ఆకేరువాగు ఉధృతి వల్ల కౌసల్యదేవిపల్లి మీదుగా మహబూబాబాద్ వెళ్లే బీటీ రోడ్డు సగానికిపైగా కోతకు గురైంది.

రహదారి ధ్వంసం..

గంగారం: మండలంలోని తిరుమలగండి–పుట్టలభూపతి ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పందిపంపుల వాగు ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జి వద్ద బుంగ పడి ప్రమాదకరంగా మారింది.

వర్షాలకు ధ్వంసమైన తిరుమలగండి-పుట్టలభూపతి ప్రధాన రహదారి →



ఇళ్లల్లోకి వరదనీరు

మహబూబాబాద్ అర్బన్ : వర్షాలతో జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఇళ్లల్లోకి వరదనీరు చేరి మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ పలువురి ఇళ్లల్లో నీరు నిలిచి ఉండడంతో కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..
వర్షాలతో ఇంట్లోకి వరదనీరు చేరింది. అలాగే ఇల్లు కురవడంతో బియ్యం, పప్పు, ఇతర నిత్యావసరాలు తడిసిముద్దయ్యాయి. కొన్ని వస్తువులు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి.
– పుట్ట సంధ్యారాణి, జమాండ్లపల్లి



జమాండ్లపల్లిలో ఇంటి చుట్టు చేరిన వరద నీరు

కోతలే కోతలు..

బయ్యారం: వరద కారణంగా మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. కొత్తపేట నుంచి ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై అలిగేరు బ్రిడ్జి సమీపంలో వరద ఉధృతికి రోడ్డు దెబ్బతింది. దీంతో కొత్తపేట నుంచి కోటగడ్డ, లింగగిరి, కొత్తగూడెం, కస్తూరినగర్, కోయగూడెం, చుంచుబంధంతండా, సుద్దరేవు, కంబాలపల్లి, నారాయణపురం తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



కొత్తపేట సమీపంలో దెబ్బతిన్న రహదారి

ఇసుక మేటలు..



పొలం మడిలో వేసిన ఇసుక మేటలు

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగు పరిసర ప్రాంతాల పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్న పంట భూముల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మూడెకరాల్లో ఇసుక మేటలు..



నాకున్న మూడెకరాలను వరి పంట కోసం సిద్ధం చేశా. ఎడతెరిపిలేని భారీ వర్షాలతో ఆకేరు వాగు వరదల వల్ల మొత్తం ఇసుక మేటలు వేశాయి. పంటలు వేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
- వెంకన్న, రైతు, ఉగ్గంపల్లి

రెండు రోజులు ఇంట్లోనే ఉన్నాం..



వరద ప్రవాహంతో మా కాలనీ ఇళ్ల చుట్టు నీరు చేరింది. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఎప్పుడు వరద పెరుగుతుందో.. ఏం జరుగుతుందో అని బిక్కు బిక్కుమంటూ రెండు రోజులు ఇంట్లోనే ఉన్నాం. వరద తగ్గిన తర్వాత కానీ ఇల్లు విడిచిరాలేదు.
-కొండ ప్రియాంక, ఆకుల లక్ష్మయ్య కాలనీ, మహబూబాబాద్

రాత్రంతా గోసపడ్డాం..



మా ఊరుకు పక్కనే ఉన్న వట్టివాగులోకి వరద నీరు ఎక్కువగా రావడంతో మా కాలనీలోని ఇళ్లన్నీ మునిగిపోయాయి. రాత్రికి రాత్రి ఇల్లు వదిలి బతుకు జీవుడా అంటూ సర్కారు బడిలోకి వెళ్లి తలదాచుకున్నాం. దాతలు పెట్టిన అన్నం తిన్నాం.. ఇంకా ఇళ్ల నుంచి వరదనీరు పోలేదు. నీళ్లతోపాటు పాములు, తేళ్లు ఇంట్లోకి చేరాయని భయంగా ఉంది.
-పల్లెపు శాంతమ్మ, అర్పనపల్లి, కేసముద్రం

ఇల్లంతా మునిగిపోయింది..



ఇంత పెద్ద వరద ఎన్నడు చూడలేదు. చూస్తుండగానే కాలనీ అంతా నీటితో నిండిపోయింది. ఇంట్లో నుంచి బయటకు వస్తామో రామో అనే భయం పట్టుకుంది. సర్కారు బడిలోకి వెళ్లి తలదాచుకున్నాం. రాత్రంతా బిక్కు బిక్కుమంటూ ఉండాల్సి వచ్చింది. మరోసారి మా కాలనీలోకి వరద నీరు రాకుండా చూడండి.
-ఓర్సు సాంబయ్య, అర్పనపల్లి



అర్పనపల్లి కాలనీ వరదనీరు తగ్గడంతో ఇంట్లో సామాన్లు సర్దుకుంటున్న మహిళ

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20కోట్ల నష్టం
- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు

బిక్కుబిక్కుమంటూ గడిపాం

మిన్నంటిన రోదనలు - 8లో

- మరిన్ని ఫొటోలు 9లో

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

గార్ల: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ రామారావు ఆదేశించారు. శుక్రవారం గార్ల కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి పిచ్చిమొక్కలు, పొదలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఒక ప్రణాళికతో విద్యార్థులను చదివిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినులకు సెల్‌ఫోన్‌లు అనుమతించొద్దని ఆదేశించారు. అనంతరం విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈఓ పూల్‌చంద్, ఏసీజీఈ శ్రీరాములు, విత్తనాల సుధాకర్, హెచ్ఎం ఉషారాణి, సీఆర్పీ ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి
డోర్నకల్: వర్షాలు పడుతున్నందున బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఈఓ రామారావు సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం డీఈఓ తనిఖీలు నిర్వహించిన అనంతరం బాలికలు, ఉపాధ్యాయురాళ్లతో మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీరాములు, పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్‌కె.మున్నీ, విత్తనాల సుధాకర్ ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- కలెక్టర్ శశాంక

తొర్రూరు రూరల్: వర్షాలతో జిల్లా వ్యాప్తంగా నష్టం వాటిల్లిందని, యుద్ధపాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. భారీ వర్షాలకు తెగిపోయిన మండలంలోని అమ్మాపురం గ్రామ శివారులో లోలెవల్ బ్రిడ్జిని కలెక్టర్ అధికారులతో కలసి పరిశీలించారు. దీంతో పాటు హరిపిరాల, రావులపల్లిలో కొట్టుకుపోయిన రహదారిని పరిశీలించారు. రోడ్డును పునరుద్ధరించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సిబ్బంది, అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తుండంతో చెరువులు, వాగులు ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీఓ రవీంద్రనాథ్, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్, ఎంపీఓ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: నీటమునిగిన ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

అర్పనపల్లి సందర్శన
కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో వట్టివాగు ఉధృతికి నీట మునిగిన వడ్డెరకాలనీలోని ఇళ్లను కలెక్టర్ శశాంక శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ప్రతీ ఇంటిని కలెక్టర్ పరిశీలించగా.. తమకు మరోచోట డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాలని బాధితులు కోరారు. అర్హుల జాబితాను అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వట్టివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఇళ్లు నీట మునిగిన బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. వట్టివాగును పరిశీలించిన అనంతరం పెనుగొండ సమీపంలోని వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా వరదనీటికి మునిగిపోయిన ఇళ్ల బాధితుల వివరాలను స్థానికులు సంబంధిత అధికారులకు అందజేశారు. పీఆర్ఈఈ సురేష్, డీఈ నర్సింగ్‌నాయక్, తహసీల్దార్ సాంబశివుడు, ఆర్ఐ క్రిష్ణప్రసాద్, ఎంపీడీఓ రవీందర్‌రావు, సర్పంచ్ స్వరూప ఉన్నారు

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద



కేటీపీపీ పంపుహౌస్‌ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్‌ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్‌ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్‌ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్‌ కంట్రోల్‌ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్‌ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్‌ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్‌ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్‌ అధ్యాపకులు...

కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్‌ అధ్యాపకులుగా ప్రొఫెసర్‌ మహ్మద్‌ ముస్తాఫా, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్‌ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్‌ అధ్యాపకులు లేక పోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు .

రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు



మొగుళ్లపల్లి : రంగాపూర్‌-ఇస్సిపేట రోడ్డు



గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు



దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు





మరిపెడ రూరల్‌ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు



చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్‌ యార్డ్‌, వైకుంఠధామాలు

నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

– సాక్షి నెట్‌వర్క్‌



నయీంనగర్‌ : నయీంనగర్‌ బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు



కమలాపూర్‌ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు



పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు



ములుగు : రోడ్డు వెంట ప్రవహిస్తున్న వరద



జవహర్‌ కాలనీలో వరద ముంపునకు గురైన మహ్మద్‌ ఖాదర్‌ పాషా గృహం



మల్హర్‌ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు



పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు



వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట



బచ్చన్నపేట : బొందుగల రోడ్డుపై తెగిన కల్వర్టు



మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్‌, గోపాల్‌పూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్‌ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్‌, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు.



యాదవనగర్‌ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్‌ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్‌ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్‌ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్‌, కిషన్‌, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్‌ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్‌ పరీక్షలకు (రెగ్యులర్‌, ఎక్స్‌, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్‌ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్‌, ఐదేళ్ల 10వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ విద్యార్థులకు రూ.1360, బ్యాక్‌ లాగ్స్‌ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం



వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచేసరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్‌. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..

హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్‌ కాలనీ–2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్‌ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్‌ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్‌, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్‌, అనిల్‌ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్‌ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్‌ సిరంగి సునీల్‌కుమార్‌, నాయకులు చింత రమేష్‌, పెద్ద రాజు, సయ్యద్‌ ఉమర్‌ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..



వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్‌ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్‌ సూపర్‌వైజర్‌ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా అచూకీ తెలిస్తే మడికొండ ఇన్‌స్పెక్టర్‌ 87126 85123, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ 87126 85248 నంబర్లలో సమచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్‌

కాజీపేట రూరల్‌ : కాజీపేట జంక్షన్‌ మీదుగా ప్రయాణించే హైదరాబాద్‌-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్‌, సికింద్రాబాద్‌-దానాపూర్‌ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీ షెడ్యూల్‌ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్‌ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్‌ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోర్బా–యశ్వంత్‌పూర్‌ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌, రక్సౌల్‌–సికింద్రాబాద్‌ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు

కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్‌ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం

కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడుల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు



అజహర్‌ మృతదేహం



మజీద్‌ఖాన్‌ మృతదేహం



షరీఫ్‌ మృతదేహం



రషీద్‌ మృతదేహం




కరీమా మృతదేహం



లాల్‌బీ మృతదేహం



సమ్మక్క మృతదేహం



మహబూబ్‌ఖాన్‌ మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్‌ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్‌ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్‌, కరీమా కుమారుడు రఫీక్‌ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గాష్‌ ఆలం, ఓఎస్‌డీ అశోక్‌, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్‌ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్‌ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్‌ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్‌ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్‌ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్‌ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్‌, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్‌ ఏమైనా దెబ్బ తిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్‌ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్‌ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడిపాం



మల్యాల, కొండాయి ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

- 24 గంటలు ప్రాణాలు అరచేతిలోనే
- నీట మునిగిన వందలాది ఇళ్లు



నీటిలో మంచం మోసుకొస్తున్న బాధితుడు

ఏటూరునాగారం : జంపన్నవాగు వరద, పెద్ద చెరువు పోటెత్తడం, జంపన్నవాగు వద్ద నిర్మించిన కరకట్ట తెగిపోవడంతో మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాల్లోని ఇళ్లు నీట మునిగాయి. 24 గంటల పాటు వరద నీటిలోనే సుమారు 200 మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భవనాలు ఎక్కి తల దాచుకున్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలోకి కూడా వరద రావడంతో భవనం పైనే ఉండిపోయారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆ రెండు గ్రామాల్లో అనేక మంది ప్రజలు నానా అవస్థలు పడుతూ దేవుడిని వేడుకుంటూ బతికి బయటపడ్డారు. దళిత కాలనీలోని 40 ఇళ్లు నేలమట్టమయ్యాయి. అలాగే దొడ్లలో కూడా ఇళ్లు కూలిపోయాయి. ఇంకా మల్యాల, కొండాయి గ్రామాల్లో శుక్రవారం సైతం వరద నీరు ఉండడంతో ప్రజలు వణికిపోతున్నారు.

బతుకుతామని ఆశ లేదు



పుట్టిననాటి నుంచి ఇప్పటి వరకు ఇంత వరద చూడలేదు. బతుకుతామని అనుకోలేదు. దేవుడి దయతో బతికి బయటపడ్డాం. మా బంధువులు చనిపోయారు. వరదలు తట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది.

– అంకూస్‌బీ, కొండాయి వరద బాధితురాలు

భవనంపైనే ఉన్నా



రాత్రి అంతా భవనంపైనే ఉన్నా. మా ఇళ్లు కొండాయిలో ఉంది. వరద వస్తుందని మల్యాల ఆశ్రమ పాఠశాల భవనం పైకి ఎక్కి కూర్చొని ఉన్నా. నా ప్రాణాలను కాపాడుకున్నా. కానీ మా బంధువులు చనిపోయారు. దేవుడు అన్యాయం చేశాడు. చాలా భయంతో గడిపాం.

– ఎండి సల్మాన్‌ఖాన్‌, కొండాయి